క్లుప్తంగా

ఎమ్మెల్యేకు పలువురి పరామర్శ



ఎమ్మెల్యే చిట్టిబాబును పరామర్శిస్తున్న రాజోలు ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: అనారోగ్యంతో హైదరాబాద్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది నగరంలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును మంగళవారం పలువురు ప్రజా ప్రతినిధులు పరామర్శించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ఆరోగ్య పరిస్థితిని వారు అడిగి తెలుసుకున్నారు. తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, రాజోలు ఎమ్మెల్యే రాపాక, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పార్టీ నేతలు కేవీఎస్ఎన్ రాజు, కంచర్ల శేఖర్, చేట్ల సత్యనారాయణ, ముప్పర్తి త్రిమూర్తులు, కె.వికాష్‌బాబు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తదితరులు చిట్టిబాబును పరామర్శించారు.

సుబ్రహ్మణేశ్వరునికి అభిషేకాలు

అంబాజీపేట: చివరి శ్రావణ మంగళవారం పురస్కరించుకుని మాచవరంలో వేంచేసిన సుబ్రహ్మణేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు మాచరి సూరిబాబు ఆధ్వర్యంలో సుబ్రహ్మణేశ్వరునికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వారిలో 20 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు.

ఆర్జేడీకి వినతిపత్రం అందజేత



ఆర్జేడీ కృష్ణకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు, నాయకులు

మలికిపురం: మలికిపురం ఎయిడెడ్ డిగ్రీ కళాశాలకు వచ్చిన హైయ్యర్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణను ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థల పరిరక్షణ సమితి నాయకులు విద్యార్థులు డిగ్రీ కళాశాల గేటు వద్ద ఆపి ఘెరావ్ చేశారు. ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థలను పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయాలని, విద్యా శాఖ నిర్లక్ష్యం విడనాడాలని, విద్యార్థులను ఆదుకుని న్యాయం చేయాలని విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సుమారు అరగంటసేపు ఘెరావ్ చేసిన అనంతరం ఆర్జేడీకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థి సంఘాల నాయకులు దేవ రాజేంద్రప్రసాద్, రాపాక మహేష్, పోలిశెట్టి గణేష్, తాడి సహదేవ్, నక్కా సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజోలు: పొన్నమండ 11 కేవీ విద్యుత్ లైన్, ఆర్‌డబ్ల్యూఎస్, తాటిపాక ఫీడర్ల మరమ్మతులు నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కడలి, వేగివారిపాలెం, గెద్దాడ, తాటిపాక, సోంపల్లి, శివకోడు, బి.సావరం గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు మంగళవారం నాడొక ప్రకటనలో అయినవిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ వి.శ్రీనివాస్ తెలిపారు. అయినవిల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ, 11 కేవీ లైన్‌లో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి చెట్ల కొమ్మలు తొలగింపు, లైన్ల మరమ్మతులు చేపడతామన్నారు. సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆకట్టుకున్న బైక్ ర్యాలీలు



జొన్నాడ నుంచి బైక్ ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఆలమూరు: ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు నిర్వహించిన బైక్ ర్యాలీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన యనమదల నాగేశ్వరరావును తొలుత పార్టీ శ్రేణులు మడికి నుంచి వందలాది వాహనాలతో ర్యాలీగా సభాస్థలికి తీసుకువచ్చారు. అలాగే జొన్నాడ, నర్సిపూడి, చొప్పెల్ల గ్రామాల్లో నుంచి అధిక సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. అలాగే సభాస్థలి వద్ద వైఎస్సార్ సీపీ జెండాలతో నిర్వహించిన గారడీ అలరించింది.

శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

- ప్రారంభమైన మండల స్థాయి స్కూల్ గేమ్స్
- మొదటి రోజు బాలికల విభాగంలో ఎంపికలు



కొత్తపేటలో క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ గంగాధరరావు



కబడ్డీ అండర్-14 విభాగంలో విన్నర్‌గా నిలిచిన ఈతకోట హైస్కూల్ విద్యార్థినులు

కొత్తపేట: నాడు జిల్లా, రాష్ట్ర క్రీడా పోటీలకు వేదికైన కొత్తపేటకు పూర్వ క్రీడా వైభవం తీసుకురావాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు క్రీడాకారులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బాలుర క్రీడా పోటీలు, ఉత్తమ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి పూర్వ క్రీడాకారుడు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సభలో వారు మాట్లాడుతూ కొత్తపేటకు ఒక ప్రత్యేకమైన క్రీడా చరిత్ర ఉందన్నారు. ఈ గడ్డ ప్రముఖ క్రీడాకారులకు పుట్టినిల్లు వంటిదన్నారు. ఇక్కడి నుంచి ఎందరో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉన్నతోద్యోగాలు పొంది జీవితంలో స్థిరపడ్డారని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ క్రీడాకారులుగా రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ-2 కె.లీలావతి, ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు ఎ.గోపాలరాజు, ఎన్.సత్యనారాయణ, మండల గేమ్స్ కోఆర్డినేటర్ వైఎస్ఎస్ ఉషారాణి, పీడీ, పీఈటీలు ఏఎస్ఎస్ రమాదేవి, ఎస్.వెంకటరమణ, కె.రఘుప్రియ, ఎ.అనంత, బి.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో బాలికల టోర్నమెంట్ కం సెలక్షన్స్ మంగళవారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి తదితరులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వివిధ విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలను నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్ నుంచి 270 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 14 విభాగంలో వాలీబాల్‌లో రావులపాలెం జెడ్పీ హైస్కూల్ విన్నర్‌గా, ఈతకోట జెడ్పీ హైస్కూల్ రన్నర్‌గా నిలిచారు. కబడ్డీలో ఈతకోట హైస్కూల్ విన్నర్‌గా, దేవరపల్లి హైస్కూల్ రన్నర్‌గా, టెన్నికాయిట్‌లో వెదిరేశ్వరం హైస్కూల్ విన్నర్‌గా, ఈతకోట హైస్కూల్ రన్నర్‌గా, షటిల్ బ్యాడ్మింటన్‌లో దేవరపల్లి హైస్కూల్ విన్నర్ గాను, నారాయణ స్కూల్ రన్నర్‌గా, త్రోబాల్లో వెదిరేశ్వరం హైస్కూల్ విన్నర్‌గా, ఈతకోట హైస్కూల్ రన్నర్‌గా, బాల్ బ్యాడ్మింటన్‌లో ఈతకోట హైస్కూల్ విన్నర్‌గా, రావులపాలెం బాలికల హైస్కూల్ రన్నర్‌గా, ఖోఖోలో నారాయణ హైస్కూల్ విన్నర్‌గా, ఊబలంక హైస్కూల్ రన్నర్‌గా నిలిచాయి. అండర్ 17 విభాగంలో వాలీబాల్‌లో ఈతకోట హైస్కూల్ విన్నర్‌గా, రావులపాలెం బాలికల హైస్కూల్ రన్నర్‌గా నిలిచాయి. కబడ్డీ, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, త్రో బాల్, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో పోటీల్లో రావులపాలెం బాలికల హైస్కూల్ జట్లు విన్నర్‌గా, ఈతకోట హైస్కూల్ జట్లు రన్నర్‌గా నిలిచినట్టు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ లక్ష్మీప్రసూన తెలిపారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: శారీరక మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయని ఎంపీపీ కుండ అన్నపూర్ణ అన్నారు. మంగళవారం స్థానిక మహాత్మాగాంధీ కళాశాల ప్రాంగణంలో ఎంపీడీఓ నాతిబుజ్జి ఆధ్వర్యంలో అండర్-14, 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను ఆమె ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలన్నారు. వ్యక్తిత్వ వికాసానికి ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ఆటలు పోటీలు ఎంతో ప్రాధాన్యం వహిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు వరప్రసాద్, సాహెబ్, వివిధ పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కార్యదర్శిగా రామకృష్ణ



అంబాజీపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి ఇన్‌చార్జి కార్యదర్శిగా వాసంశెట్టి రామకృష్ణ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీలో స్పెషల్ గ్రేడ్ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఆయన అంబాజీపేట ఏఎంసీకి ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కార్యదర్శి వైఎస్ భాస్కరరావు శ్రీకాకుళం మార్కెట్ కమిటీకి బదిలీపై వెళ్లారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంపై సమీక్ష

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష జరిగింది. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెదపళ్ల, చొప్పెల్ల వైద్యాధికారులు డి.సువర్చలానాయుడు, పి.భవానీశంకర్, డి.మల్లికార్జున పాల్గొని వైద్యారోగ్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామ వలంటీర్ల సహకారంతో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సంబంధిత సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. నిర్దేశించిన సమయంలో ప్రతి గ్రామంలోనూ స్పెషలిస్ట్ డాక్టర్లను తీసుకువచ్చి చికిత్స అందించేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఏర్పాట్లు చేసిందన్నారు. గ్రామాల్లో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన బాధ్యత ఆరోగ్య, ఆశ సిబ్బందిదేనన్నారు. ఎంఈఓ పి.శాలెంరాజు, ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ వి.రామ్‌స్వరూప్, సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెచ్‌ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎస్.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై డీఎల్‌డీఓ ఎం.ప్రభాకరరావు మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాడి శ్రీవెంకటాచార్య అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ హెల్త్ సూపర్ వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు హాజరయ్యారు.

వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం

- బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్నా పట్టించుకోని అధికారులు
- సమస్యలపై అధికారులను నిలదీసిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు



సమావేశంలో సమస్యలను ఎంపీడీఓకు వివరిస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

అంబాజీపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య 8వ సమావేశం మంగళవారం రసాభాసగా జరిగింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ముక్తకంఠంతో అధికారుల తీరును ప్రశ్నించారు. ఓ దశలో సమస్యలు పరిష్కారం కాని ఈ సమావేశాలు ఎందుకని ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ సమస్యలను పరిష్కరించలేదని ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభ్యులు ఎంపీపీ పోడియం ముందు నిరసనకు దిగారు. ప్రభుత్వం మద్యం షాపుల్లో క్వార్టర్ బాటిల్‌కు రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో జోరుగా మద్యం విక్రయిస్తున్న ఎక్సైజ్ అధికారులు ఎందుకు దాడులు చేయడం లేదని వాకలగరువు ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు అధికారులను నిలదీశారు. మాచవరంలో గత నెల రోజులుగా చెత్త డంపింగ్ సమస్య ఉన్నప్పటికీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి ప్రజాప్రతినిధులను, అధికారులను నిలదీశారు. అలాగే గ్రామంలో మంచినీటి ప్రాజెక్టు నిర్మించి ఏళ్లు గడుస్తున్న ప్రజలకు తాగునీరు కూడా అందించలేని పరిస్థితి ఉందని తక్షణమే ప్రాజెక్టును ప్రారంభించి ప్రజలకు రక్షిత తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంబాజీపేట బస్టాండ్ వద్ద మద్యం షాపు ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతుందని ఆర్టీసీ బస్టాండ్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి అక్కడ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు దొరబాబు ఆర్టీసీ అధికారులను డిమాండ్ చేశారు. అంబాజీపేట మండలంలో మూడు గ్రామాల్లో విద్యుత్ ఉప కేంద్రాలు ఉన్నప్పటికీ ప్రజలకు కరెంటు కష్టాలు తప్పడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజర్ కావడంపై సభ్యులు మండిపడ్డారు. ఆద్యంతం సమావేశం వాడీవేడిగానే సాగింది. మండలంలో నెలకొన్న విద్యుత్, అంగన్‌వాడీ తదితర సమస్యలను సమావేశంలో చర్చించారు. సమావేశంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వైస్ ఎంపీపీలు నేతల నాగరాజు, సూదాబత్తుల లక్ష్మీభార్గవి, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, నందుల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- రూ.1.6 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం
- శంకుస్థాపన చేసిన మంత్రి వేణు, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



చింతలూరులో నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వేణు, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో ప్రసిద్ధిగాంచిన నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.1.6 కోట్లు మంజూరయ్యాయి. మ్యాచింగ్ గ్రాంట్ కింద నూకాంబిక ఆలయం రూ.60 లక్షలు చెల్లించగా సీజీఎఫ్ పథకం కింద ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రూ.కోటి మంజూరు చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఏజీపీ నామాల శ్రీనివాసు, ఈఓ ఉండవల్లి వీర్రాజు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి వేణు, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి శంకుస్థాపన చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ మార్గని కరుణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ నిర్మాణంలో రాజీ లేకుండా నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రుడా మాజీ చైర్మన్ ఎం.షర్మిలారెడ్డి, అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి, ఎంపీటీసీ చుండ్రు సునీత, ఆలమూరు సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ మోరంపూడి వాసు, దేవస్థానం తనిఖీ ఇన్‌స్పెక్టర్ కె.బాలాజీ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను గుర్తించేది వైఎస్సార్ సీపీనే..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: కార్యకర్తల కష్టాన్ని గుర్తించే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం తాటిపాకలో మాజీ ఎంపీటీసీ, గ్రామశాఖ అధ్యక్షుడు మెడబల రాజ్‌కుమార్ అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే రాపాక ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను నియమించి పార్టీ అభివృద్ధికి బాటలు వేశారన్నారు. పార్టీలో కష్టించి పని చేసే కార్యకర్తలకు కచ్చితంగా గుర్తింపు లభిస్తుందన్నారు. బీసీ, ఎస్సీ, మైనార్టీలకు రాజకీయంగా అనేక పదవులు కేటాయించారన్నారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం జగన్ పాలన చేస్తున్నారని, మళ్లీ ఆయనను సీఎంగా విజయపథంలో నిలపాలని ఎమ్మెల్యే రాపాక పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఏస్తేరురాణి, జిల్లా మైనార్టీ కార్పొరేషన్ సభ్యుడు కనపాల బాబూరావు, గుబ్బల మనోహర్, కాండ్రేగుల వెంకటేశ్వరరావు, పితాని సాయిబాబు, మామిడిశెట్టి చింతా ప్రసాద్, మామిడిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు మంగళవారం నాడొక ప్రకటనలో తెలిపారు. ఆలయ తనిఖీదారు, దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చక సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొంటారని తెలిపారు.

క్షణికావేశాలకు దూరంగా ఉండాలి



మలికిపురంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌జేడీ కృష్ణ

మలికిపురం: యువతతో పాటు ప్రతి ఒక్కరూ క్షణికావేశాలకు దూరంగా, ఓర్పు, సహనంతో ముందుకు సాగాలని కళాశాలల ఆర్‌జేడీ చప్పిడి కృష్ణ సూచించారు. మలికిపురం ఎంవీఎన్ జేఎస్‌అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలో మంగళవారం స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 'వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ అవేర్‌నెస్ మంత్' పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఆర్జేడీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో యువత తప్పు దారి పట్టకుండా చూడవలసిన బాధ్యత అందిరిపై ఉందని, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను అభినందించారు. యువత చక్కని ఆలోచనా విధానం అలవరచుకుని తమ భవిష్యతను తీర్చి దిద్దుకోవాలని సూచించారు. డిగ్రీ కళాశాల ఆర్జేడీ చప్పిడి కృష్ణ, రుసా ప్రతినిధి శ్రీదేవి, కళాశాల యాజమాన్య సభ్యులు జాన శంకరరావు, డా.రుద్రరాజు పద్మరాజు, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రైజ్ ప్రోగ్రాం ఇంచార్జ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీవీవీ వర ప్రసాద్, కోనసీమ జిల్లా అధ్యక్షుడు యన్.రమేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ టి.సతీష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



అంబాజీపేటలో స్వచ్ఛ పక్వాడ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు వెంకటేశ్వరరావు, ప్రకాష్

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అంతే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలని ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో స్వచ్ఛపక్వాడ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన మంగళవారం మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. అంతకుముందు స్వచ్ఛ పక్వాడ ర్యాలీని నిర్వహించి, మొక్కలు పెంచాలని, కాలుష్య నివారణకు కృషి చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, దీప్తి కళాశాలకు చెందిన విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, మొక్కల పెంపకం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. దీంతో పాటు సోషల్ మీడియాపై కూడా అవగాహన కల్పించారు. ఏపీ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది.

భూముల రీ సర్వే సక్రమంగా జరపాలి

ఆత్రేయపురం: అగ్రికల్చర్ ల్యాండ్ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ కంఠం భూములకు సంబంధించిన మ్యాప్‌లు సిద్ధమైనట్లు భూములు సర్వే సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆత్రేయపురం, మెర్లపాలెం, లొల్ల, వాడపల్లి, కట్టుంగ, పులిదిండి, వసంతవాడ గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ యు.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


13 పోలింగ్ కేంద్రాల మార్పు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ రమణారెడ్డి

పి.గన్నవరం: నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలల పాత భవనాలు తొలగించి కొత్తవి నిర్మిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని 13 పోలింగ్ స్టేషన్లను మార్పు చేస్తున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణారెడ్డి తెలిపారు. 9 కేంద్రాలను పక్కనే ఉన్న భవనాలకు, మరో నాలుగు కేంద్రాలను అదే లొకేషన్లో మరో ప్రాంతానికి మార్చుతున్నట్టు ఆయన వివరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాల డోర్ టు డోర్ వెరిఫికేషన్ కార్యక్రమం పూర్తయిందని, ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. తహసీల్దార్లు జి.రవీంద్రనాథ్ ఠాగూర్, సీహెచ్ నాగలక్ష్మి, మంగతాయారు, రియాజ్ హుస్సేన్, డీటీ బి.గోపాలకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, చీకరమెల్లి శ్రీనివాస్, కుసుమ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు దాణా వితరణ



గోశాలకు దాణా వితరణ చేస్తున్న దాత దివాకర్

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలోని గోశాలకు మంగళవారం హైదరాబాద్‌కు చెందిన దాత బెల్లంకొండ రామ దివాకర్-శారదారాణి దంపతులు 300 కేజీల దాణాను వితరణ చేశారు. ఈ మేరకు దాణాను ఆలయ సిబ్బందికి అప్పగించారు. న్యాయవాది బెల్లంకొండ సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.